


# డామిట్! కథ అడ్డం తిరిగింది

## - చంద్ర చిత్ర

(ఆంధ్రజనత - 1967 ఏప్రిల్ 10 సంచికనుంచి పునర్ముద్రితం)

కాలచక్రంలో పడి సుమారుగా ఐదేళ్ళు గడిచాయి. కాని నాలో ఏమార్పూ కలగలేదు. ఐదేళ్ళ క్రితం తాలూకాఫీసులో గుమాస్తాగా ప్రవేశించిన నాకు ఇంతవరకు ప్రమోషన్ లు కలుగలేదు. నా అనుభవంలో ఎంతోమంది గుమాస్తాలు వచ్చారు వెళ్ళిపోయారు.




మిత్రుడు గోపాలం దగ్గర్నించి వస్తున్న ఉత్తరాల్లో కూడా మార్పుల్లేవు. ఎంతసేపూ మేమిద్దరం ఉత్తర ప్రత్యుత్తరాల్లో క్షేమాలు తప్పితే మరేమీ వ్రాసుకొనేవాళ్ళం కాదు.

కాని నిన్న హఠాత్తుగా గోపాలం దగ్గర్నించి వచ్చిన వుత్తరం ఈ ఐదేళ్ళుగా వాడి దగ్గర్నించి వచ్చిన సుమారు పాతిక పదుల వుత్తరాలకి అతి భిన్నంగా వుంది.

"స్టార్టు ఇమీడియట్లీ, యాజ్ యూ సీ దిస్ లెటర్...

యువర్స్_

_గోపాల్ "

నిజంగా నేను ఈ వుత్తరాన్ని చూచి ఎంత ఆశ్చర్యపోయానంటే ఎంత ఆశ్చర్యపోతే మీకేంగానీ.. నిజంగానే ఆశ్చర్యపోయాలెండి.

ఇంతకీ ఈ ఉత్తరం చూచి నేను బయల్దేరాననుకుంటున్నారు కదూ! ఊహూఁ... పాపం మా గోపాలం అదృష్టమా అంటూ నాకు లీవు దొరకలేదు. "ఐదు రోజులపాటు లీవు కావాలండీ" అంటూ ఆఫీసరుగారికి పంపిన కాగితం మీద ఎర్రని అక్షరాలు నన్ను మళ్ళీ మాట్లాడనీకుండా చేశాయి.

"ఐదు రోజులు కాదు... ఐదు నిమిషాలు కూడా దొరకవు. జాగ్రత్త!"

ఎలా ఉన్నాయండీ ఈ మాటలు. అదేదో తెలుగు బైస్కోపులో హీరో తండ్రి "నే చెప్పినట్టు చేయకపోతే నా ఆస్తిలో ఒక్క..ఖ... చిల్లికానీ కూడా ముట్టదు" అని బెదిరించినట్టు లేదూ! అందుకని ఆ హీరో తన తండ్రి చెప్పిందల్లా చేయటానికే ఒప్పుకున్నట్లు నేనూ గప్ చిప్ గా... ఫైల్లో మునిగిపోయాను, సముద్రంలో మునిగినవాడిలా.

చెప్పొచ్చేదేమిటంటే రెండ్రోజులు తిరక్కుండానే మా గోపాలం గాడు ఆఫీసులోకి ఊడిపడ్డాడు.

"నేను రమ్మనక.. రమ్మనక..మ్మన"(ఇదేదో అరవ పిక్చరు డైలాగులా వుంది కదూ...!) "రమ్మంటే నీకింత పొగరా!!??" అని అరిచేశాడు. ఆ అల్లరికి నలుగురూ చేరి నాలుగు అక్షింతలు (తిట్లు: "ఈ గొడవ ఏమిటండీ, ఇది ఆఫీసు అనుకున్నారా, గాడిదల కొట్టం అనుకున్నారా" ఇది మీ ఇల్లయినట్లుందే ఇత్యాదివి...) తగలేస్తారని భయపడ్డాను. కాని మా గోపాలమే చల్లబడ్డాడు, "అయినా నిన్ననేం లాభం. నా రాత ఎలా రాసి వుంటే అలా జరక్క తప్పుతుందా?" అంటూ.

ఎవరూ ఏమనక ముందరే నేను గోపాలాన్ని బరబరా బయటకు లాక్కుపోయి లాంఛన ప్రాయంగా కాంటీనులో కాఫీ ఇప్పించి, రూం తాళం చెవి యిచ్చి "వెళ్ళి పడుకో, స్నానం చేసి, నేను సాయంత్రానికల్లా వస్తాను. కావలసివస్తే టెబుల్ మీద మీల్స్ టికెట్ ఒహటి తీసుకో." అని గబ గబా చెప్పి ఆఫీసుకు బయల్దేరా. అప్పటికే చాలా ఆలీసెం అయిపోయినందుకు గోపాలానికి చాలా కోపం వచ్చినట్టుంది, వాడేమీ మాట్లాడలేదు.

నేను ఆఫీసు గదిలోకి అడుగెడుతూనే ప్రారంభదశగా మా ఆఫీసరు తన వాచీని నా కళ్ళ ముందరుంచారు. మొదటే భయపడ్డ నేను, "మా గోపాలం వచ్చాడండీ... అందుకని... కాస్త ఆలీసెం జరిగిపోయిందండీ." నసుగుతూ ఆ నాలుగు ముక్కలు అనేశాను ముందరే జాగ్రత్తపడ్డాను.

"లాస్ట్ ఛాన్స్! ఈ వాళ్టికి గంట... అంటే సాయంత్రానికి ఒక గంట ఇంటికి లేటుగా వెళ్ళు!"

ఆజ్ఞ జారీ చేశాడు.

"సరేనండీ!" విధిలేక ఒక్క ముక్కా అన్నాను.

సాయంత్రం..

"ఐదయింది" అంది గోడగడియారం. నేను ఫైళ్ళన్నీ సర్దేశాను. "అబ్బ ఇప్పటికా రిలీఫ్" అనుకున్నాను. లేచి సిగరెట్టు ముట్టించుకుని బయల్దేరా.

"ఎక్కడికీ?" పిడుగు పడిందేమోననుకున్నాను. అదిరి పడ్డాను. పడ్డానంటే క్రింద పడ్డం కాదండీ.. ఊరికే బెదిరి పోయాను. అరే, పోయానంటే బయటిగ్గానీ, ఇంటిగ్గానీ కాదండోయ్. ఏమీ అనుకోవద్దు. నేను తెనుగులో చాలా వెనకగా వున్నాను లెండి. లెండి అంటే అప్పుడే లేచేరు సుమండీ.. ఈ కథ పూర్తిగా చదివి లేవండి.

ఇంతకీ నేనెక్కడ ఆపాను. ఆఁ.. "పిడుగు" అన్నాను కదూ. అది మా ఆఫీసరు గొంతుక. చచ్చినట్టు తిరిగి వెళ్ళి నా సీట్లో కూర్చుని మళ్ళీ ఫైళ్ళన్నీ ముందరేసుకున్నాను.

"ఐదున్నర" అంది మళ్ళీ అదే గోడగడి...

"ఐతే అవనీ..." కసురుకుని మరో ఫైలు తీసుకుంటూ అద్దిరి పడేసరికి చేతనున్న ఫైలు కాస్తా క్రింద పడింది. నేను వీపు చరుచుకోబోతూ మళ్ళీ బెదిరాను.

"ఎందుకు?" అనుకుంటున్నంతలో మా గోపాలం నాకళ్ళక్కనిపించాడు. నేను మా వాణ్ణి మాట్లాడేందుకు సమయం ఇవ్వకుండానే జరిగిందంతా చెప్పి. "మరో అరగంట ఓపిక పట్టరా" అని వేడుకున్నాను. వాడు సరేనని విసుగ్గా నాకెదురుగా కూర్చున్నాడు.

ఎలాగయితేనేం మేమిద్దరం ఆరుగంటల వరకూ ఓపిగ్గా కూర్చుని తర్వాత ఆఫీసు వదిలాం.

కాంటీను కెళ్ళేంత వరకు మా గోపాలం ఏమీ మాట్లాడలేదు. నాకాశ్చర్యం వేసింది.

కాఫీకి ఆర్డరిచ్చాను.

"ఒరేయ్!...శేఖరం..." నన్ను సంబోధించాడు మా గోపాలం.

"ఊఁ" అన్నాన్నేను.

"మీకు సోమవారం నాడు సెలవు కదూ!"

"అవును"

"రేపు"

"ఆదివారం ఆఫీసు లేదు"

"మంగళవారం"

"ఆఫీసు వుంది."

కాఫీలు వచ్చాయి. మెల్లిగా చప్పరించి తాగేసి బిల్లు చెల్లించి బయల్దేరాం.

"శేఖర్! ఈ రాత్రికి మనం బండెక్కెయ్యాలి."

"ఈ రాత్రికా?"

"అవును. రేపు ఆదివారం ఎల్లుండి సెలవు. నువ్వు చేయవలసింది చాలా వుంది" అన్నాడు వాడు సిగరెట్టును ఆఖరుసారిగా పీల్చి దూరంగా గిరాటేస్తూ.

ఇక్కడ మా గోపాలం గూర్చి కొంత చెప్తా. గోపాలం నాతో పాటు బి.ఎ. వరకూ చదివాడు. వాడికి ఓ సంపన్నుల కూతురుతో వివాహం అయింది. అయితే వాడు చేసుకున్న అమ్మాయి బాగుండదు. లావు, పొట్టి, నలుపురంగుగా వుంటుంది.

మరి మా గోపాలం ఆవిడతో వివాహానికి ఎందుకు ఒప్పుకున్నాడో మీకర్థం అయి వుంటుంది. గోపాలానికి ఉద్యోగం గానీ సద్యోగం గానీ లేవు. వాడికి వాడి మామగారి ఆస్తివుంది. వాడి మామగారికి వేరే పిల్లలు లేరు. ఆస్తంతా ఆ అమ్మాయి పేరనే వుంది. మామగారు కొద్దిరోజుల క్రితమే చనిపోయారు.

"ఇంతకీ అసలు విషయం..."

"ఏమిటంటావు" పూర్తిచేశాడు మా గోపాలం

"విను. ఈ మధ్య మా ఆవిడకి జబ్బుచేసింది. చాలా రోజులు బ్రతకదన్నారు. నేను సంతోషించాను..."

"అదేం పోయే కాలంరా నీకు. సుశీల నీవు కట్టుకున్న పెళ్ళాంరా. ఆవిడ చచ్చిపోతోంటే నీకు సంతోషంగా వుందిరా వెధవాయ్" నేను వాణ్ణి కోప్పడ్డాను.

"అక్కడే వుంది అసలు కిటుకు. ఈ మధ్య ఓ అమ్మాయి పేరు శారద. మా ఇంట్లోకి అద్దెకిల్లు కావాలంటూ వచ్చింది. శారదని చూసినప్పట్నించి ఇదిగా వుందిరా. ఆమె ఇంకా "మిస్" ఆమెని "మిసెస్ గోపాలం" అని పిలవాలని వుందిరా. ఏదో ఆఫీసులో టైపిస్ట్ గా ఉందిట. నాతో చాలా సన్నిహితంగానే వుంటోంది ఈ మధ్య. నేను శారదని ప్రేమిస్తున్నానా..."

నా నెత్తిన పిడుగు పడినట్లయింది, ఉలికి పడ్డాను. ఈ సారి నేను నిజంగా క్రిందపడ్డంత పనయింది. "నీ భార్య వుండగానే ఈ బుద్ధి ఏమిట్రా?" అన్నాన్నేను ఆశ్చర్యంగా.

"మరి ఏం జేయను. సుశీలకి విడాకులు ఇద్దామనుకున్నాను. కాని తగిన కారణాలు చూపించాలన్నారు. కారణాలు నాకేవీ కనిపించలేదు. ఇంకో విషయం విడాకులిస్తే ఆస్తిరాదు. అందుకని ఆ ప్రయత్నం మానుకున్నా. దైవకృపవల్ల సుశీలకి ఈ జబ్బు వచ్చింది. ఎంత త్వరగా దాటితే అంత మంచిది. మాకా పిల్లలు లేరు..."

"అయితే నీ ప్రయత్నం సుశీల త్వరగా దాటి పోవాలనా?" ఎదురు ప్రశ్న వేశాను.

"కాదు, శారదకు నా ప్రేమ విషయం..."

"తెలిపి..." నా మాట పూర్తికాకుండానే "పెళ్ళికి ఒప్పించమంటాను." అన్నాడు వాడు.

నాకు చిర్రెత్తుకొచ్చింది. "అసలీ పాడు పనికి నేనొప్పుకుంటానని ఎలా అనుకున్నావు?" దాదాపు గర్జించినంతగా మా గోపాలం మీద కేకలేశాను.

"శారద చాలా అందంగా వుం..."

"...దంటావు. నీవే మాత్రం అందంగా వున్నావురా. ఛస్తే నేనీపని చేయలేను" నిక్కచ్చిగా చెప్పేశాను.

గోపాలం నన్ను ఒప్పించడానికి శతవిధాల ప్రయత్నించి, "చూడరా, ఇప్పుడు సుశీలకి ఎలాగూ చావు తప్పదుగదా. పోనీ ఇప్పుడు నేనీ ప్రయత్నం మానుకున్నానే అనుకో సుశీల పోయింతర్వాత నేను ఇలాగే ఒంటరిగా వుండాలా? మళ్ళీ మీరందరూ నన్ను ఒప్పించి రెండో పెళ్ళి చేయించేవాళ్ళా కాదా? అందుకని శేఖరం! నీవు తప్పకుండా ఈ ఒక్క విషయంలో కాస్త సాయపడుదూ" అన్నాడు తెలుగుసినిమాల్లో హీరోయిన్ ని హీరో బుజ్జగించినట్లు.

నాకూ వీడి అయిడియా నచ్చింది. సబబుగానే తోచింది వీడి ఉద్దేశ్యం.

"సరే" నన్నాను.

"అన్నావురా. నాకు తెలుసు నీవు తప్పకుండా ఒప్పుకుంటావని" అంటూ నన్ను అమాంతం రోడ్డుమీదే కౌగిలించుకున్నాడు. "తల్లి గారింటికి వచ్చిన ఆడపడుచు కన్న తల్లిని వాటేసుకున్నట్లు". "చాలా రోజులకి కలుసుకున్న భార్యా భర్తల్లా", "ఆరాధన సినిమాలో నాగేశ్వరరావూ సావిత్రీ కౌగిలించుకున్నట్లూ (ఇక చాలనుకుంటాను ఇన్ని ఉపమానాలు).

తరవాత జరిగిన విషయం మీరు ఊహించుకోగలరనుకుంటా చెప్పడమెందుకులెండి. అప్పుడే లేవకండి. ప్లీజ్, మోర్ సమ్ మినిట్స్!

గోపాలం వూరు చేరుకోగానే మొదట "సెంట్రల్ హాస్పిటల్" కు వెళ్ళాం.

నేను ఊహించినట్లు లేదు సుశీల చాలా చిక్కిపోయి వుంది. పెండ్లినాడు చూచినంత నలుపుగా లేదు. ఇపుడంత పొట్టిగా కూడా లేదు. అంత అందంగా లేకపోయినా "ఆడది" అనేందుకు సరిపోతుంది.

నన్ను చూడగానే తోటకూర కాడల్లా వాలిపోయి వున్న తన చేతుల్తో నాకు నమస్కరించింది బెర్త్ మీద పడుకునే.

ప్రతి నమస్కారం చేశాను. కుశల ప్రశ్నలు అడిగిన తర్వాత నేనూ మా గోపాలం కాస్సేపు అక్కడే కూర్చుని లేచాము. "భయం ఏమీ లేదమ్మా త్వరలోనే తగ్గుతుంది" అన్నాన్నేను.

ఆమె ఏమీ జవాబు చెప్పలేదు. తర్వాత మేమిద్దరం గోపాలం బంగళా చేరుకున్నాము. సాయంత్రం వరకూ మేమిద్దరం పిచ్చాపాటీ సాగించాము. శారద ఆఫీసు నుండి వచ్చింది. ఆమెను నేను నఖశిఖ పర్యంతం జాగ్రత్తగా పరిశీలించాను దూరంనుండే.

"నమస్కారమండీ గోపాలం గారు! వూరునుండి ఎప్పుడు తిరిగొచ్చారు" శారద దగ్గరగా వచ్చి అంది. వీణ పలుకులా వుంది ఆమె కంఠం.

కంఠం వినగానే కరిగిపోయాను. నేనూ ప్రేమించేద్దామనుకున్నాను. కాని మధ్యని గోపాలంగాడు...!

నన్ను ఆమెకీ, ఆమెకు నన్నూ పరిచయం చేశాడు.

"ఈవిడ శారద మా యింట్లోనే అద్దెకి వుంటోంది. బి.ఎ.పాసయింది, ఒక్కర్తే వుంది. ఈమె తల్లిగారు ఇంకా ఊరినుండి రాలేదు. ఈ నెల్లోనే రావచ్చు..."

వాడు ఆమెను నాకింకా పూర్తిగా పరిచయం చెయ్యక ముందే నేను "నమస్కారం" అన్నాను.

"నమస్కారం" అంది ప్రతి నమస్కారం చేస్తూ.

"కూర్చోండి" అన్నాన్నేను సోఫా చూపుతూ. శారద కూర్చుంది.

"వీడు శేఖరం నా స్నేహితుడు తాలూకాఫీసులో గుమాస్తాగిరీ వెలగబెడుతున్నాడు బి.ఎ. వరకూ చదివి."

గోపాలం నా గూర్చి అన్న మాటలివి. నన్ను హేళన చేస్తున్నట్లు వున్నాయి కదండీ. నిజం చెప్పొద్దూ నాకు చచ్చేంత సిగ్గు... సిగ్గు కాదండోయ్ కోపం వచ్చింది కాని పాలపొంగులా చల్లబడ్డాను. నీళ్ళు చల్లినట్లు.

"కథలు రాస్తూంటాడు లెండి. ఈ మధ్యనే ఏదో నవల వెలువడింది వీడిది" నా గొప్పని కూడా చెబుతున్నందుకు ఫరవాలేదని ఏదో సినిమాలో లాగా వేరే ఫోజు కొట్టబోయాను. కాని కుదర్లా.

పై విధంగా మా పరిచయాలు ముగిసి మరో అరగంటకల్లా ఎంతోకాలం నుంచీ స్నేహమున్న వాళ్ళలా మాట్లాడుకున్నాం.

గడిపిన ఆది, సోమవారాలు ఎంతో హుషారుగా గడిచిపోయాయి. ఈ రెండ్రోజులూ శారదకి కూడా సెలవులు కాబట్టి ఆవిడ కూడా మాతోనే గడిపింది. ఓ రోజు షికారుకి ఊరి బయటకి పోయాము అక్కడ పొలం గట్టుమీద నడుస్తూంటే శారద కాలు జారింది, వెనకగా నడుస్తూన్న గోపాలం

చటుక్కున చేయిపట్టుకుని వాటేసుకున్నాడు. "ప్రథమ... రంగం" అనుకున్నాను. శారద ఏమీ అనకుండానే "థ్యాంక్స్" అంది, మరోసారి సినిమాలో శారదకి రెండు సార్లు చేయి తగిలించి. కాని ఆమె ఏమీ అనకపోవడంతో నాకు రహస్యంగా చెప్పేశాడు ఆమె కూడా తనని ప్రేమిస్తున్నట్టు"

"ఇంకేం సుశీల పోవడమే తరువాయి కార్యక్రమం అనుకున్నాను.

సోమవారం సాయంత్రం నేను బయల్దేరడానికి బట్టలు సర్దుకొంటున్నప్పుడు హాస్పిటల్ నుండి నౌకరు వచ్చి. "అమ్మగారికి ప్రాణం మీద వుందండీ. అంటూ చెప్పాడు. అప్పుడు శారద ఇంట్లో లేదు.

నేనూ గోపాలం హడావుడిగా హాస్పిటల్ చేరుకున్నాము. అప్పటికి ఆపరేషన్ రూంకి తీసుకుపోయారు సుశీలని.

మేము బయట బెంచి మీద కూర్చున్నాము.

"ఇంతకీ జబ్బు ఏమిటీ?" అన్నాన్నేను నిశ్శబ్దాన్ని భంగ పరుస్తూ.

"కడుపులో ఏదో కాయ కాసిందట" వాడి గొంతుక జీరపోయింది. సుశీల చచ్చిపోవాలనుకున్న వాడే ఇలా అయిపోయాడు వాడి మొహంలో కాంతి లేదు; ఏదో పోగొట్టుకున్న వాడిలా వుంది. వాడి కళ్ళలో నీరు స్పష్టంగా నాక్కనిపించింది వాణ్ణింక ఏమీ ప్రశ్నలడగలేదు.

కాలం గడుస్తోంది

గదిలోంచి డాక్టరు వచ్చాడు చెమటని తుడుచుకొంటూ.

"ఎలా వుందండీ?" ఆతృతగా అడిగాడు గోపాలం.

"ఈ రోజు గడిస్తేగాని చెప్పలేం, ఈ రోజు కాదుగానీ ఇంకో మూడు గంటలాగాలి" అన్నాడు డాక్టరు. తర్వాత ఆయన మళ్ళీ లోపలికి వెళ్ళిపోయాడు.

నేను నిశ్శబ్దంగా వుండిపోయాను.

"ఒరేయ్ శేఖరం నీవు యింటికెళ్ళు. నేను తర్వాత వస్తాగానీ" అన్నాడు.

నేను "సరే"నని ఇల్లు చేరుకున్నాను. అప్పటికే శారద వచ్చింది. శారదని చూడగానే నేను వచ్చిన పని జ్ఞాపకానికి వచ్చింది.

ఆమె ప్రవర్తన అలా వుంది కానీ ఆమె అభిప్రాయం కూడా కనుక్కోవటం ముఖ్యమనిపించింది నాకు. ఏమైనా కానీ ఆమెని అడిగి తెలుసుకోవాలనిపించింది.

గోపాలం యింటికి రావడానికి యింక అరగంటే వుంది. శారదని అడగాలని నాలో ఉత్సుకత ఎలా ప్రారంభించాలో తికమక పడి ధైర్యంగా ఆమె గది లోకి వెళ్ళా.

"రండి! రండి!" శారద నన్ను చూసి ఆహ్వానించింది. ఆమె చేతిలో ఏదో ఇంగ్లీషు నవల వుంది.

"గోపాలం ఇంట్లో లేడాండీ" నేను ఎలా పలుకరించాలీ అన్న సంధిగ్ధావస్థలో వుంటంతో ఆమె పలుకరించింది.

"లేడండి ! సుశీలకి ప్రమాదంగా వుందిట. మరో అరగంటకి ఏ విషయం తెలుస్తుంది." ధైర్యం కూడగట్టుకుని మాట్లాడేను.

"అరే! నేను యింట్లో లేనండీ. పాపం మంచి ఇల్లాలు. ఆమె బ్రతకాలని వెయ్యి దేవుళ్ళకి మొక్కుకుంటున్నా"నంది.

నేను ఉలిక్కిపడ్డాను. 'ఏమిటీ' అనుకున్నాన్నేను. ఈమె అన్నట్లే సుశీల బతికి బయటపడితే?

"శారదగారూ ! (మొట్టమొదటిసారిగా నేను ఆమెను పేరుతో పలుకరించాను) మా గోపాలం... మా గోపాలం..." తర్వాత నసిగాను.

"అవును, కట్టుకున్న భార్య బాధ పడుతూంటే బాధ కలగదూ" అంది శారద.

"అది కాదండీ, మా గోపాలం మిమ్మల్ని మనసారా ప్రేమిం..." నా మాట పూర్తి కాకుండానే ప్రజ్వరిల్లింది శారద.

నేనూహించినదానికి వ్యతిరిక్తంగా జరిగింది.

"మీ గోపాలం మనిషేనా? అని కట్టుకున్న భార్య కళ్ళేదుట ఉండగానే నన్ను ప్రేమించారా చదువుకున్న మగాడు బుద్ధివుందా."

నేను కుర్చీకి అంటుకుపోయి మాట్లాడకుండా నోరు తెరిచా...

"అందుకేనా మొదట అద్దెకి గది లేదంటూ తర్వాత స్వయంగా పిలిచి గది ఇచ్చారు... అయినా మీకేనా బుద్ధిలేదాండీ మీరు కూడా మందలించక పోయారు నాకు ఆయన మీద ఇలాంటి అభిప్రాయం ఏనాడూ, ఏకోశానా లేదు. మీరింక వెళ్ళవచ్చు. ఆయన వచ్చిన తర్వాత గది గూర్చి అడుగుతాలేండి" ఆమె రుసరుస లాడుతూ మాటలని పూర్తి చేయక ముందే నేను గబుక్కుని బయటకు గెంతి, వెళ్ళి గ్లాసెడు నీళ్ళు త్రాగి "బ్రతుకు జీవుడా" అనుకుని సోఫాలో కూలబడ్డాను. జరుగబోయేదాన్ని గురించి ఆలోచిస్తూ.

వాడొచ్చాక జరిగినదంతా చెప్పేస్తే "ఇలాగేనట్రా అడిగేదని" తనూ నన్నే కోప్పడితే "అబ్బాయ్! నేను రానంటే బలవంతంగా నువ్వే తీసుకొచ్చావ్, అందుకు నాది కాదు తప్పు" అంటా అనుకున్నాను.

ఇలా ఆలోచిస్తూండంగానే ఎదురుగా గోపాలం కన్పించాడు. వాడు కన్పించిన రీతి నాకు భయం కల్గించింది. వాడు చాలా ఉత్సాహంగా వున్నాడు వాడి మోహాన చిరునవ్వు తొణికిసలాడుతోంది. నాకు ఈ విషయం చెబ్దామా? వద్దా?? అన్న ప్రశ్నలు ఎదురుగా నిలిచాయి.

"ఒరేయ్! శేఖరం నా సుశీల... సుశీల.. అవునుగానీ శారద ఒప్పుకుందిరా.. ఒక వేళ ఒప్పుకుంటే క్షమించమని చెప్పు! నేనిప్పుడు ఆవిణ్ణి ప్రేమించను పెండ్లి చేసుకోను, అయినా నా సుశీల వుందికదా" అన్నాడు అతి సంతోషంగా నాకు అనుమానం కలిగింది "పిచ్చి పట్టిందేమో"నని.

"అసలు విషయం తెలుసా నా సుశీల బ్రతికింది. ఇక ఈ జబ్బువల్ల ముసలితనం వరకూ ఏ ప్రమాదం రాదట. నా సుశీల నాకు వుంది అయినా యిపుడు సుశీల అందంగా లేదూ" అన్నాడు వాడు.

"డామిట్! కథ అడ్డం తిరిగింది. అయినా ఇదీ మన మంచికేరా" అంటూ అసలు విషయాన్ని ఇదే సందని వాడికి చెప్పాను.

వాడు "నిజం?" అంటూ శారద గదిలోకి వెళ్ళాడు.

మరో పదినిముషాలకి నా దగ్గరకి వచ్చి "శారద నిన్ను ప్రేమించిందటరా!" అన్నాడు.

★★★

COMMENTS